# 2. గడ్డిపూలు

**నేపథ్యం:**

నేడు పిల్లల నుండి పెద్దల వరకు దాదాపుగా అందరం యాంత్రిక జీవనాన్ని గడుపుతున్నాం. కాస్త ప్రశాంతంగా చుట్టు ప్రక్కల పరిసరాలను కూడా గమనించకుండా పోతూ ఉంటాం. ఎప్పుడో ఒకసారి మాత్రం ఆటవిడుపుగా శీతల పర్వత ప్రాంతాలకో, ప్రకృతి విహారాలకో వెళతాం. అచ్చటి ప్రకృతి రమ్యతను చూచి ప్రశంసిస్తాం, ఆనందిస్తాం. కానీ మనం ప్రతిరోజూ కాస్తా తీరికగా చుట్టుపట్ల గమనిస్తే కూడా ఈ విధమైన ఆనందాన్ని పొందవచ్చు. అదెట్లో ఈ గేయం చదివి తెలుసుకుందాం.



దాక్కుని ఉంటాయ్
దాక్కుని ఉంటాయ్! దారంట గడ్డి ని
రుక్కుని వుంటాయి.
తలపగ రానిపూలు, పిలుపగ బోనిపూలు,
నిలుపగ లేని పూలు – దాక్కుని వుంటాయ్,
గ్రుక్కెడు వాననీళ్లకు పక్కున నవ్వుతాయి
లెక్కకు రావో లక్షే, చిక్కవు మాలనుగ్రుచ్చ
ఇక్కడ నక్కడ బచ్చ, జక్కన పూస్తాయి.

దాక్కుని చూస్తాయి! దారంటగడ్డి నిరుక్కుని కూస్తాయి!
ఒక్కడ నడుస్తువుంటే, చుక్కలు పొడుస్తూవుంటే
మక్కువ కూర్చోమంటాయి; ఎక్కడో, ఎందుకో! చెప్పవు,
దాక్కునివుంటాయి, దారంట గడ్డి నిరుక్కుని ఉంటాయి.
మంచుబిందువు పడిన ఎంచి భాష్పము విడిన
అంచుల గాస్తాయి, వంచక మోస్తాయి
దాక్కుని వుంటాయి, దారంట గడ్డిని
రుక్కుని వుంటాయి!

**I.** **వినండి–సంభాషించండి.**

1. మీకు తెలిసిన పూల పేర్లు, అవి ఏ రంగులో ఉంటాయో చెప్పండి.
2. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ గారికి ఏ పూవనిన ఇష్టము? ఆ పువ్వును నెహ్రూగారు ఎచ్చట ధరించేవారు?
3. మన జాతీయ పుష్పం పేరేంటి?

**II.** **చదవండి–ఆలోచించండి–రాయండి.**

**అ.** **పదజాలాన్ని పెంపొందించుకుందాం – భావం నేర్చుకుందాం.**

మక్కువ = ఇష్టము; మాల = దండ; భాష్పము = నీటి ఆవిరి; దారి + అంట = దారి పొడవునా;
ఇరుక్కొని = క్రిక్కిఱిసి; గుక్కెడు = కొద్దిగా.

**ఆ.** **భావం:**

గడ్డిపూలు దారి పొడవునా దాక్కొని ఉంటాయి. గడ్డియందు ఇరుక్కొని వుంటాయి. తలపుకురాని పూలు, ఆహ్వానించని పూలు, నిలబడలేని పూలు దాక్కొని ఉంటాయి. కొద్దిపాటి వాన నీళ్ళకే ఫక్కున నవ్వుతాయి. ఆ పూలు లక్షల కొలది వున్నప్పటికి లెక్కకురావు. ఆ పూలతో దండను గుచ్చుటకు అవి చేతికి రావు. కాని అవి ఇక్కడ, అక్కడ అనకుండా, ఎక్కడైనా చక్కగా, పచ్చగా పూస్తాయి. ఆ గడ్డిపూలు దాక్కొని చూస్తాయి. దారి పొడవునా గడ్డియందు ఇరుక్కొని పిలుస్తాయి. దారి పొడవునా ఒక్కరూ నడుస్తుంటే, చుక్కలు పొడుస్తుంటే ఎంతో ఇష్టంగా కూర్చేమంటాయి. మరి ఎక్కడో, ఎందుకో చెప్పవు. ఆ గడ్డిపూల యందు మంచు బిందువు అంచులయందు పడినా వాటిని మోస్తాయి. ఆ గడ్డిపూలు దారి పొడవునా దాక్కొని వుంటాయి, గడ్డి యందు ఇరుక్కొని వుంటాయి.

**III.** **వినండి–చర్చించండి–రాయండి.**


**అ.** **జవాబులు రాయండి.**

1. గడ్డిపూలు ఉండుచోటు. 2. గడ్డిపూల ప్రాధాన్యత.

**ఆ.** **కింది గేయ చరణాలను సరైన క్రమంలో రాయండి.**

గుక్కెడు వాన నీళ్ళకు పక్కున నవ్వుతాయి.
మక్కువ కూర్చేమంటాయి; ఎక్కడో, ఎందుకొ! చెప్పవు.
అంచులగాస్తాయి, వంచక మోస్తాయి.
ఇక్కడ నక్కడ బచ్చ, జక్కన పూస్తాయి.

**ఇ.** **అల్లిక**




**IV.** **స్వీయస్పందన:**

1. గడ్డిపూల లక్షణాలను గూర్చి మీ సొంతమాటల్లో రాయండి.
2. వివిధ రకాల పూలను సేకరించి, ఆ పూల ప్రయోజనాలను మీ సొంతమాటల్లో రాయండి.

**V.** **భాషావగాహన:**

**కింది వాక్యాలు సామాన్య, సంయుక్తములలో ఏరకానికి చెందినవో రాయండి.**

1. గడ్డిపూలు దాక్కుని వుంటాయి. 2. గడ్డిపూలు ఇక్కడ నక్కడ బచ్చ, జక్కన పూస్తాయి.

## VI. సృజనాత్మకత

1. బతుకమ్మను వివిధ రకాల పూలతో ఎలా తయారు చేస్తారో రాయండి.
2. అన్ని శుభసందర్భాలలో మనము పూలనుపయోగిస్తాము– దీనిపై మీ అభిప్రాయాన్ని వ్యక్తం చేయండి.

## VII. లేఖననైపుణ్యాలు :

**కింద నిచ్చిన పరిచ్ఛేదమును చదివి 5 ప్రశ్నలను తయారుచేయండి.**

జ్ఞానసముపార్జన అనునది విద్యార్థుల ముఖ్య లక్ష్యము. దీనికి ఏకాగ్రత, మానసిక వికాసం అవసరం. వీటిని యోగసాధన వలన పొందవచ్చు. ఈ యోగమును గూర్చి తెలుపునది యోగశాస్త్రము. పతంజలి మహర్షి ఈ యోగశాస్త్రమును మొట్టమొదటిగా ప్రపంచమునకు అందించెను. శరీరమును, మనస్సును సమన్వయ పరచటమే 'యోగము'. యోగ శాస్త్రములోని ఒక భాగము ఆసనములు. ఇవి శరీరమునకు నిలకడను, ఆరోగ్యమును కలుగజేయును. శారీరక వ్యాధులను, మానసిక వ్యాధులను పోగొట్టును.

### భాషాభాగాలు

ఒకరితోనొకరు మాట్లాడుకొనుటకు మనకు భాష అవసరం. ఈ భాషలో అక్షరాలు, పదాలు, వాక్యాలుంటాయి.

పదము : కొన్ని అర్థవంతమైన అక్షరములు కలియగా ఏర్పడునది పదము. ఉదా: కమల

**క్ + అ = క; మ్ + అ = మ; ల్ + అ = ల = కమల అయినది.**

వాక్యము : అర్థవంతమైన పదము లేదా పదాల సముదాయము వాక్యము.

ఉదా. : నేను పాఠము చదువుచున్నాను.

ఈ భాష యొక్క భాగాలు భాషాభాగాలు. అవి ఐదు.

**1. నామ వాచకము, 2. సర్వనామము, 3. క్రియ, 4. విశేషణము, 5. అవ్యయము**

**1. నామవాచకము :** పేర్లను తెలుపు పదములు నామవాచకములు.

ఉదా. : హరి, ముంబయి, పులి, ఈగ, కాకి, పుస్తకము, బంగారము, చక్కెర, పాలము మొదలగునవి.

**2. సర్వనామము :** నామవాచకమునకు బదులుగా వాడబడు పదములు సర్వనామములు.

ఉదా : ఆమె, అతడు, నేను, నీవు, మీరు, మేము, అది, అవి, ఇది, వీరు, వారు, వాడు, వీడు మొదలగునవి.

**3. క్రియ :** పనిని తెలియజేయుపదము క్రియ.

ఉదా : చదువుచున్నది, పరుగెత్తుచున్నది, చదివెను, వచ్చెను, వెళ్ళిరి, వండెను, రాగలదు, వెళ్ళగలదు మొదలగునవి.

**4. విశేషణము :** నామవాచకము యొక్క గుణమును తెలియజేయుపదము విశేషణము.

ఉదా : తీపి పండు, మంచి బాలుడు, నల్లని గుర్రము, నాలుగు కాళ్ళు మొదలగునవి.

**5. అవ్యయము :** లింగ, వచన, విభక్తులు లేని పదాలను అవ్యయములు అందురు.

ఉదా : ఆహా, ఓహో, ఔరా, అక్కడ, అప్పుడు, సర్వత్రా! మొదలగునవి.

### నేనివి నేర్చుకున్నా:

- ప్రకృతిని, జీవవైవిధ్యాన్ని (Bio diversity) గౌరవించుట.
- భూమిపై గల చిన్ని చిన్ని ప్రకృతి అందాలను ఆస్వాదించుట.

**ఉ.సూ:** రకరకాల పువ్వుల గురించి అంతర్జాలంలో చూసి విద్యార్థులకు తెలపండి.

**వి.సూ:** శీతల పర్వత ప్రాంతాలలో లభించే రకరకాల సుందర పుష్పాల గురించి అంతర్జాలంలో చూసి తెలుసుకోండి.

I8BDAH